కథ

# మనస్సు నవ్వుతోంది

కోరం రాజబాబు

గత రాత్రి నేనేం చూశాను? ఎన్ని సార్లు నాలో నేను ప్రశ్నించుకున్నానో చెప్పలేను. నిజానికి ఒక్క రాత్రేమిటి? చాలా రాత్రులు చూడకూడనివి చాలా చూశాను.



పదేళ్ళ వయసు నుంచి అందీ అందనట్టుండే రాత్రులెన్నో గడిచిపోయాయి. ఒక్కో సంఘటన గుర్తొస్తుంటే కన్నీళ్ళాగడం లేదు. అంటే... ఆ సంఘర్షణలోంచి తప్పించుకోలేకపోతున్నాననేగా? సంఘర్షణ అంటే ఏమిటసలు? ఇరవై ఏళ్ళ నా వయసు సృష్టించిందా? లేక నా హృదయానికి తగిలిన గాయంలోంచి పుట్టిందా? నిజానికి నా వయసు నా అదుపులోనే వుంది. అదుపు తప్పతున్నది మాత్రం నా ఆవేశం. చూడకూడని దృశ్యాలు చూసిన నా కళ్ళు ఆవేశానికి సాక్షిగా రగిలిపోతున్నాయి.

అసలు నాకేమవుతోంది? ఇన్నిరోజులుగా కన్పించని మార్పు ఒక్క రోజులో..నిజమే! ఏదో అనీజీనెస్. ఏదో కోల్పోతున్న భావన. అగాధంలోకి నన్నెవరో తోసేస్తున్న ఫీలింగ్. వీటన్నింటికన్నా తెలియని ఇన్‌సెక్యూరిటీ నన్ను ఒంటరిదాన్ని చేస్తున్నాయి. స్త్రీగా పుట్టినందుకు మరో స్త్రీపై అసహ్యం పెంచుకోవడం కూడా ఏదోలా వుంది. ఏం చేయాలి? అసలామె ఎవరో అయితే నేనెందుకు ఈ వేదన అనుభవించాలి?

'ఏయ్ సౌదా నీవెంత అందంగా వున్నావే!' అని ఫ్రెండ్స్ అంటున్నప్పుడు గర్వంతో పొంగిపోయేదాన్ని. తెల్లగా మెరిసిపోతున్నావే! అంటూ మెచ్చుకుంటుంటే ఊహల పందిళ్ళు అల్లుకునేదాన్ని. ఇప్పుడవన్నీ ఏమయ్యాయి? ఆ గర్వం ఏమయింది? నా ఊహలు ఎటు వెళ్ళిపోయాయి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు నా దగ్గరే వున్నాయి. అమ్మ.. ఎంత మధురమైన పేరు. మరి నాకేంటి అమ్మంటే కసి..కోపం..అసహ్యం? అమ్మ ఏమనేదో తెలుసా?

"సౌదా! ఇంత సౌందర్యరాశిని నాకోసమే ఆ భగవంతుడు పుట్టించి వుంటాడు. నీవు నా ఆస్తివి". ఆ మాటల అర్థాలు వెతుక్కుంటుంటే ఒళ్ళు మండిపోతోంది నాకు. ఏ.సి. గదులు, కార్లు, కావలసినంత స్వేచ్ఛ ఆమె నాకు ఇచ్చింది. ప్రేమేమో అనుకున్నాను. ఎర వేస్తుందని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

"కాలి గోటితో మగాళ్ళను నిలబెట్టాలి" అని చాలా సార్లు అందామె. అవన్నీ విని అప్పుడు నవ్వుకున్నాను. అలా వుండేందుకు ప్రయత్నించాను కూడా. నిజం తెలిశాక కూడా నవ్వుకున్నాను. పిచ్చిగా ఏడ్చాను. మేమెక్కడ నుంచి వచ్చామో! ఎలా బ్రతికామో నాకు కొద్దికొద్దిగా గుర్తుంది. ఆలోచించే వయసు వచ్చేసరికి విలాసవంతమైన జీవితం వచ్చిపడింది.

ఒకప్పుడు మాకెవ్వరూ లేరు. మరిప్పుడేంటి ఎంతో మంది అప్తులు, అభిమానులు? వాళ్ళంతా ఎందుకొస్తున్నారో నాకు తెలుసు. తెలిసినా ఇన్నాళ్లూ ఆలోచిస్తూ గడిపేశాను.

స్వేచ్ఛగా బ్రతికిన రోజులు గుర్తుకొస్తున్నాయి. అవన్నీ నా ఆశల పందిళ్ళు. ఇప్పుడూ నాకు స్వేచ్ఛ వుంది. కాని ఆ స్వేచ్ఛంటే నాకు అసహ్యం పుట్టిందిప్పుడు. నా జీవితం, నేను కోరుకున్న స్వేచ్ఛ నాకోసం కాక మరెవరికో అంటే ఇచ్చేయడానికి నేనేమీ ఆ అంతఃపుర కన్యను కాను. మనసు పెరిగిన దాన్ని. వయసు వుంది. ఆ రెండింటినీ బంధిస్తానంటే నేనెలా వూరుకుంటాను?

** ** ** ** ** **

రాత్రి అమ్మ ఎవరితోనో నా గురించి మాట్లాడుతుంటే విన్నాను. నన్ను, నా పరువాన్ని బేరం పెడుతుందని అప్పుడే అర్థమయింది నాకు. ప్రేమ, ఆప్యాయత, మమకారం కన్నా వున్న స్టేటస్ కోసం మరింత ఆరాటం, ఆర్భాటం పట్ల మక్కువ వున్న అమ్మ.. మా కులంలో ఇదేమీ విచిత్రం కాదట. అదొక అదృష్టమట. అలా చెప్పే మాటలు ఎంత జుగుప్సగా వున్నాయి! నాకు నేనుగా ఆమె దారిలోకి రావాలని యత్నించింది. నా నిర్ణయం అటు వుండాలంటే ఒక్క క్షణం చాలు.

నిజానికి నేను కలలు కన్న ప్రపంచం వేరు. అమ్మ మనసులో వున్న ఆలోచనే వేరు. ఆమె నిర్ణయం బయటపడ్డాక నా జీవితం పట్ల మరింత ఆశ పెరిగింది నాలో.. అక్కడే సంఘర్షణలో పడిపోయాను. ఇప్పుడు నేనేం చేయాలి? 'నువ్వు సృష్టించిన జీవితం నాకొద్దు' అని గట్టిగా అరిచి చెప్పాలా? లేక అమ్మా! నాకు అన్యాయం చేయవద్దని ప్రాధేయపడాలా? నా మెదడు నరాలు చిట్లిపోయేలా వేడెక్కిపోతోంది. అనీజీనెస్ – అగమ్యగోచరం – అర్థమయినా వీడిపోని పజిల్‌లా కన్పిస్తున్న జీవితం. చాలాసేపు కెరటాల్లా ఎగసి పడిన ఆలోచనలు స్తంభించిపోయాయి. భయం వేసిందెందుకో.

సరిగ్గా అర్ధరాత్రి దాటిందనుకుంటా. కనురెప్పలు బరువెక్కుతుంటే మరేవో జ్ఞాపకాలు నన్నెక్కడికో తీసుకుపోయాయి. అద్భుతం... అవెంతో మధురంగా వున్నట్టు ఎవరో ఆ జ్ఞాపకాల మధ్య..నెమ్మదిగా గుర్తొస్తోంది. అతనే ఫాజిల్. ఆర్నెల్ల క్రితం అనుకుంటా! అమ్మ అతన్ని ఇంట్లోంచి పొమ్మంది.

సన్నటి గడ్డంతో ఎర్రగా, ఎత్తుగా వుండే ఫాజిల్ అమ్మ దగ్గర డ్రైవర్‌గా వుండేవాడు. రాత్రయ్యాక మందు, బిర్యానీ సరఫరా చేసే సేవకుడు కూడా. నన్ను మాత్రం ఎంతో మర్యాదగా పిలిచేవాడు. అతనెంతో ఉన్నతమైనవాడని తెలిసేసరికి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు అతనెందుకు గుర్తుకొస్తున్నాడు? అతనితో నేనెప్పుడూ చనువుగా కూడా ప్రవర్తించలేదే! అయితే వ్యక్తిగా అభిమానించాను. అతనో నిజాయితీపరుడని అనుకునేదాన్ని. ఆ అభిమానం ఎక్కడో నా మనసు మూలల్లో దాగి వుందా? కొన్ని ఆలోచనలకు స్పష్టత, స్వరూపం వుండవు. నేనున్న పరిస్థితుల్లో అతను గుర్తుకు రావడం వింతగా వుంది. ఇప్పుడేవో నాలో సరికొత్త ఆలోచనలు. నెమ్మదిగా ఆకృతిదాలుస్తున్న గమ్యం. జీవితంపై మరింత ఆశ. ఆనందంతో మనసు పురివిప్పిన నెమలిలా అయింది. ఆలోచనలతో అలసిపోయిన శరీరానికి, మనసుకు విశ్రాంతినివ్వడానికి కను రెప్పలు విఫల యత్నం చేస్తున్నాయి. కాని తొలుస్తున్న ఆలోచనలు వెలిసే సూచనలు కానరావడంలేదు.

ఫాజిల్ ఇప్పుడెక్కడ? ఆర్నెల్లయింది అతడిని చూసి. అతనికి ఇప్పుడు పెళ్ళయిందా? అలా ఆలోచిస్తున్నందుకు నాకేమీ సిగ్గుగా లేదు. ఆశ పెంచుకోవడం వేరు. ఆశించడం వేరు. నేనేమీ అతనిపై ఆశ పెంచుకోలేదు. అతన్ని కోరుకుంటున్నాను. దక్కకపోతే నా గమ్యాన్ని మాత్రం మార్చుకోను. తిరిగి రెక్కలు కట్టుకున్నాయి. అలా వారం రోజులు గడిపేశాను. ఒంటరిగా నా గమ్యానికి చేరుకునే ప్రయత్నం ఎప్పుడో ఆగిపోయింది. అతన్తో ప్రయాణం చేయాలి. అలా ఒక అపురూపమైన కలయిక కోసం ఎదురు చూస్తున్నాను.

** ** ** ** **

వైజాగ్ రైల్వే స్టేషన్ చాలా సందడిగా వుంది. అప్పటికే ఆగివున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ క్లాస్‌లో నేను కూర్చున్నాను. మనసంతా ఒకటే ఆలోచన. ఏ.సీ.లో వున్నా స్వేదంతో ఒళ్ళంతా తడిసిపోతోంది. టెన్షన్. టెన్షన్.. టెన్షన్.. డోర్ దగ్గరకు వచ్చాను. నాకళ్ళు ఒక మధురమైన సన్నివేశం కోసం ఆశగా చూస్తున్నాయి. నిమిషాలు మరింత వేగంగా దొర్లిపోతున్న ఫీలింగ్ నాలో. ట్రైన్ కదిలేందుకు సిగ్నల్ కూడా ఇచ్చేశారు. నేను ఆ దృశ్యాన్ని చూడగలనా? దుఃఖం గుండెల్లోంచి తన్నుకొస్తోంది. ప్లాట్‌ఫాం చివరికంటూ చూశాను. నాకు కన్నీళ్ళాగడంలేదు. పెద్దగా కూతవేసి భారంగా కదిలింది ట్రైన్ అచ్చం నా మనసులా.

ట్రైన్ సగం ప్లాట్‌ఫాం దాటేసింది. సరిగ్గా..అప్పుడే పరుగుపరుగున ప్లాట్‌ఫాం మీదికొచ్చిన కవితను చూశాను. మనసంతా దూదిపింజలా మారిపోయింది.

"సౌదా.. నువ్వు కోరుకున్నవాడిని నీక్కూడా పంపిస్తున్నాను. స్నేహితురాలిగా నా పని నేను చేశాను" అన్నట్టుగా చేయి వూపుతోంది కవిత. ఆ ఆనందంలో నాకు నోట మాట రావడం లేదు. నేనూ చేయి వూపాను కృతజ్ఞతగా. నా మనసిప్పుడు నవ్వుతోంది హాయిగా.. నిండుగా.. నిజంగా.